క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో డేరంగుల రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు, అదే విధంగా ఉప్పుట చారిటబుల్ ట్రస్ట్ రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



తెలకపల్లి: అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని సీపీఐ మండల కార్యదర్శి వెనెపల్లి రవీందర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని వట్టిపల్లిలో సీపీఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయన్నారు. ఎంతో మందికి పేదలు ఉన్నా గుర్తించకపోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం హామీల అమలులో విఫలం అయ్యిందన్నారు. బాలమురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



పెద్దకొత్తపల్లి: సీపీఐ మండల మహాసభ ఈనెల 15న వెన్నచెర్లలో నిర్వహిస్తున్నట్లు మండల సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం దేవినేనిపల్లిలో సీపీఐ కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల అరెస్టు



వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులను ఆదివారం తెల్లవారు జామున పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మంత్రి వర్గ విస్తరణలో గిరిజనులకు చోటు కల్పించకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీ భవన్ ఎదుట నిరసనలకు పిలుపునివ్వడంతో మండల నాయకులు తరలివెళ్లకుండా వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు రాత్లావత్ రఘునాయక్, ఆయా గ్రామాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు



మన్ననూర్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మన్ననూర్‌లోని పెట్రోల్ పంపు సమీపంలో అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఒకరు మద్యం తాగి పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



కొల్లాపూర్: పట్టణంలోని బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ లెక్కింపు ఆదివారం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఆదిత్య లక్ష్మారావు సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులు హుండీ లెక్కించారు. మూడు సంవత్సరాల తర్వాత హుండీ లెక్కించారు. మొత్తం రూ.8వేలు మాత్రమే ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. హుండీలో అయస్కాంతాలు, చూయింగ్‌గమ్‌లు ఉండడంతో హుండీ డబ్బులు చోరీకి గురై ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు భావిస్తున్నారు. భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ అకౌంట్‌లో జమచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అస్తవ్యస్తంగా రోడ్ల నిర్వహణ

- కనిపించని మార్కింగ్
- సూచిక బోర్డులు కరువు



బల్మూర్- అచ్చంపేట డబుల్‌రోడ్డులో కన్పించని సైడ్ లైన్స్



సూచిక బోర్డులు లేని ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారి

అచ్చంపేట రూరల్: డివిజన్ పరిధిలో రోడ్ల నిర్వహణ సక్రమంగా లేక తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన రహదారుల నిర్వహణ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తారు రోడ్డుపై మూడు వరుసల తెల్ల లైన్ మార్కింగ్ కన్పించడం లేదు. సూచిక బోర్డులు లేక మూల మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తారు రోడ్లు ఏర్పాటు చేసినా... వాటిపై ఎలాంటి మార్కింగ్‌లు ఇవ్వడం లేదు. వాహనదారులు లైన్ తప్పడంతో ఇతర వాహనదారులు అవస్థల ఎదుర్కొంటున్నారు. వాహనదారులు అతివేగంగా వెళ్లడమే కాకుండా ఓవర్‌టేక్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రాత్రివేళ వాహనాలు గతి తప్పి తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

రోడ్లపై లైనింగ్ ఏదీ

బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటగా అధికారంలోకి వచ్చాక మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు డబుల్ రోడ్లు వేశారు. ఆదరాబాదరగా పనులు చేపట్టారు. నిర్వహణ గాలికివదిలేయడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఉప్పునుంతల మండల కేంద్రం నుంచి అచ్చంపేటకు, బల్మూర్ నుంచి అచ్చంపేటకు ఇలా ప్రతి మండల కేంద్రం నుంచి డివిజన్ కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు కలిపారు. వాటికి తెల్ల లైన్ మార్కింగ్ ఇవ్వలేదు. వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తున్నాయి. మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ రోడ్లపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రద్దీగా ఉండే రహదారిపై తెల్ల లైనింగ్ మార్కింగ్ ఇవ్వలేదు. రూ. కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టినా.. నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది.

చేపట్టాల్సిన పనులు ఇవే...

తారు రోడ్లపై మూడు వరుసల తెల్ల లైన్ మార్కింగ్, రిఫ్లెక్ట్ స్టడ్స్, కర్వ్ బోర్డులు, స్పీడ్ లిమిటెడ్ బోర్డులు, సైడ్ బర్మ్ పనులు చేపట్టాల్సి ఉన్నా.. చాలా ఏళ్ల నుంచి అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. రోడ్ల పనుల్లోని ఎస్టిమేట్‌లో ఉన్న విధంగానే పనులు చేపట్టామని అధికారులు చెబుతున్నారు. రోడ్లు వేసిన ఏడాదికే ఎత్తు పల్లాలు, గుంతలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నిబంధనల మేరకే పనులు

అప్పట్లో ఎస్టిమేట్ ప్రకారమే రోడ్ల పనులు చేపట్టారు. రకరకాల కారణాల వల్ల డబుల్ రోడ్లపై మూడు వరుసల తెల్లలైన్ మార్కింగ్ వేయకపోవచ్చు. నిబంధనల మేరకే పనులు పూర్తయ్యాయి. రోడ్ల మరమ్మతులు, ఇతర విషయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరైతేనే పనులు చేపడుతాం.

– జలంధర్, ఆర్‌అండ్‌బీ డీఈ, అచ్చంపేట

కొనసాగుతున్న బడిబాట

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని వివిధ కాలనీలలో ఉపాధ్యాయులు ఆదివారం బడిబాట నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు, నోటు బుక్కులు, పెన్నులు పెన్సిల్స్, యూనిఫాం అందజేస్తారని వివరించారు. హెచ్‌ఎం విజయ్‌మోహన్, లాల్‌సింగ్, ఎల్లయ్య, టీబీ, శివలింగం, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పొలంబాట

ఉప్పునుంతల: వానాకాలం పంటల సాగుకోసం రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యాయి. బడిబాటలో భాగంగా గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు లేకపోవడంతో ఉపాధ్యాయులు పొలంబాట పట్టారు. స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, ఇతర ఉపాధ్యాయులు వ్యవసాయ పొలాల్లోకే వెళ్లి వారు పనులు చేసే చోటనే ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించుకోవాలని కోరారు.



ఉప్పునుంతలలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్

సంపాదకుడిపై అక్రమ కేసు ఎత్తేయాలి

కందనూలు: ఓ పత్రిక సంపాదకుడిపై పెట్టిన కేసును వెంటనే ఎత్తేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాగర్ కర్నూల్ నియోజకవర్గ అధ్యక్షుడు సందు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సాయిలుసాగర్‌లు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాన్ని పత్రికలో ప్రచురిస్తే ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పుడు ఫిర్యాదు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ ప్రశ్నించే వారి గొంతు నొక్కడమేనని ఆరోపించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొల్లాపూర్‌లో మాలల సంబరాలు



కొల్లాపూర్: రాష్ట్ర మంత్రి వర్గంలో గడ్డం వివేక్ వెంకటస్వామికి స్థానం కల్పించడాన్ని హర్షిస్తూ ఆదివారం కొల్లాపూర్‌లో మాలలు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చి మిఠాయిలు పంచారు. మాలలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం సంతోషకరమన్నారు. మాలల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్నె విష్ణు, రాందాసు, వెంకట్రాములు, కురుమయ్య సందీప్, భరత్ తదితరులు ఉన్నారు.

మాల మహానాడు నాయకులు హర్షం

మన్ననూర్: చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కేబినెట్ మంత్రి పదవి వరించడంతో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల దివాకర్, దూమర్ల ఎల్లస్వామి, కల్ముల శ్రీశైలం ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ మండల కమిటీ ఏకగ్రీవం

లింగాల: నాగర్‌కర్నూల్‌లో జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు, మండల ఇన్‌చార్జ్ రమేష్‌రావు, మండల అధ్యక్షుడు గువ్వని నవీన్ ఆధ్వర్యంలో బీజేపీ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎస్.శంకర్, ఇ.శ్రీనివాసులు, బాలగుర్వయ్య, పి.శివకుమార్, జనరల్ సెక్రెటరీలుగా ఎస్.సైదులు, కె.శ్రీనివాసులు, కార్యదర్శులుగా బి.కృష్ణయ్య, కె.ప్రమీల, వి.ప్రసాద్, కె.జానకమ్మ, కోశాధికారిగా సత్యనారాయణతో పాటు మరో 34 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేందర్

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తుల ద్వారా శాంతి చర్చలు జరపాలని కోరారు. ఆదివాసీలకు మద్దతుగా ఉన్న మావోయిస్టులపై హత్యాకాండ కొనసాగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపాల్, మల్లేష్, వివిధ సంఘాల నాయకులు మస్తాన్, నాసరయ్య, లక్ష్మీనారాయణ, అంజయ్య, బాలయ్య, బాలకిష్టయ్య, శ్రీశైలం, యాదయ్య, బీఎస్పీ నాయకులు కృపానందం, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సగర సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ



కందనూలు: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్ రోడ్డు వద్ద సగర సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగరుల భవన నిర్మాణానికి, అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో సగరసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆర్‌బీ ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్కసగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడల ఆంజనేయులు, మోత్ల బాబుసాగర్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీను, జిల్లా గౌరవఅధ్యక్షుడు రాముడు మేస్త్రీ, జిల్లా సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన గంగాపురం భీమయ్య ఆర్మీ జవాన్‌గా 22 ఏళ్లు పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం శాలివాహన సంఘం, గణేష్ యూత్ సంఘం నాయకులు పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సతీష్‌గౌడు, సుధాకుమార్, నవీన్‌రెడ్డి, మధుసూదన్ గౌడు, నాగేష్‌గౌడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కట్టా అనంతరెడ్డి

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు కట్టా అనంతరెడ్డి, తిప్పర్తి నర్సింహారెడ్డి పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో మూడు నెలల్లో నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలను చేపట్టాలని కోరారు. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులు మించకుండ నిర్మాణాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు లింగమయ్య, కర్నాటి సత్యం, మేడమోని భాస్కర్, బచ్చన్నగౌడ్, రీంబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ఐకమత్యంతో పనిచేయాలి



నూతన కమిటీ సభ్యులతో డీఎస్పీ నియోజకవర్గ నాయకురాలు సంధ్యారాణి

పాన్‌గల్: ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) బలోపేతానికి కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని పార్టీ నియోజకవర్గ నాయకులు ఆది సంధ్యారాణి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహనీయుల ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం పార్టీ మండల కమిటీని నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా రేమద్దుల గ్రామానికి చెందిన శ్రీనిప్రసాద్‌ను, మండల ప్రధాన కార్యదర్శిగా శివరాజ్, కార్యదర్శిగా రాములును నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, శేఖర్, లక్ష్మణ్, సురేందర్ దితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్‌నాయకులు

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన రాత్లావత్ రాజుకు మంజూరైన రూ.37,500 సీఎం సహాయ నిధి చెక్కును ఆదివారం కాంగ్రెస్ నాయకులు రేక్యానాయక్, ప్రేమ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం సహాయ నిధితో పేదలు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారన్నారు. చెక్కు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, సహకరించిన మండల నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తండా కాంగ్రెస్ నాయకులు బిక్యానాయక్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం



మన్ననూర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయి. ప్రణాళికా లేకపోవడంతో నిర్మించిన భవనాలను కూల్చివేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులకు ముందుచూపు లేకపోవడంతో ప్రజా ధనం వృథా అవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో ఇంజినీరింగ్ కార్యాలయం అదనపు నిర్మాణం పనులు చేపట్టేందుకు గానూ ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. ఈ క్రమంలో ప్లాన్ లేకుండా నిర్మాణం చేశారు. దీంతో నిర్మించిన భవనాన్ని అవసరం మేరకు కూల్చి మరమ్మతు చేపట్టారు. చెంచులక్ష్మి రెస్టారెంటుకు రెండు సార్లు టెండర్లు పిలిచి పనులు చేపట్టిన తర్వాత కూల్చివేసి తిరిగి మూడోసారి కొత్తగా పనులు చేపడుతుండటం గమనార్హం. సంబంధిత ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారుల పని విధానంపై విచారణ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

డబుల్ రోడ్డు నిర్మించండి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్డుగా మార్చాలని ఎన్నో రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వీపనగండ్ల, కల్వరాల్ల, కేతేపల్లి గ్రామాల వరకు 10 కి.మీ.ల బీటీ రోడ్డును డబుల్ బీటీ రోడ్డుగా నిర్మిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, చిన్నంబావి మండల ప్రజలు జిల్లా కేంద్రానికి ఈ రహదారి గుండా వెళ్లితే దాదాపు 10 కి.మీ.లు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం



లింగాల: కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని సీనియర్ బ్లాక్ బెల్ట్ డాన్ గ్రాండ్ మాస్టర్ కేటీ తిర్పతయ్య అన్నారు. మండల కేంద్రంలో బ్లాక్ బెల్ట్ మాస్టర్ ముఖేష్ నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో ఆదివారం ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. మొదటి మూడు స్థానాలు నిలిచిన బాలికల విభాగంలో దీక్షిత, సృజన, హర్షితలకు బాలుర విభాగంలో మేదాన్ష్, దీపక్ నందన్, దిలీప్ కుమార్‌లకు మెడల్స్ అందజేశారు. ఈ శిబిరంలో 31 మంది చిన్నారులకు నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ రవి, నూకల శంకర్‌బాబు, వాసవీ క్లబ్ మండల శాఖ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన వాకిటి శ్రీహరిని యువజన కాంగ్రెస్ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుస్తకాల రాహుల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్యాముద్దీన్, వంశీ తదితరులు ఉన్నారు.



జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేనా?

- ఉన్నత చదువులకు విద్యార్థులు దూరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



లింగాల ఉన్నత పాఠశాల

లింగాల: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. కొందరు తప్పనిపరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాల ఏర్పాటు పాలకులు ఎన్నికల వాగ్దానంగా మార్చుకుంటున్నారే తప్పా అమలు చేయడంలో చిత్తశుద్ధి కనబర్చడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా మండలవాసులు, విద్యావంతులు డిమాండ్ చేస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో రెండు, మండల పరిధిలోని అంబట్‌పల్లిలో ఒకటి ఉన్నత పాఠశాలు ఉన్నాయి. 10వ తరగతి పూర్తి చేసిన వారు ప్రతి ఏటా 800లకు పైగా విద్యార్థులు ఉంటారు. మండలంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు జిల్లా కేంద్రానికి, అచ్చంపేట, కొండనాగుల కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో అధిక శాతం గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. పేద, మధ్య తరగతి పిల్లలు ఫీజులు చెల్లించ లేక చదువులకు స్వస్తి పలుకుతున్నారు.

ఉన్నత విద్యకు బాలికలు దూరం

కళాశాల విద్యకు ఇతర ప్రాంతాలకు పోవాలంటే విద్యార్థులు ముఖ్యంగా బాలికలు తీవ్ర అసౌకర్యానికి దూరమవుతున్నారు. దీనితో అమ్మాయిలు ఇంటి వద్దనే ఉంటుండగా అబ్బాయిలు మాత్రం వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుతో పాటు, బాలికల ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ఈ సారైన పాలకులు అమలు చేస్తారని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

ఉన్నత చదువులకు ఇబ్బందులు



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవాలంటే ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయి. కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను అటు పాలకులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 2025–26 విద్యా సంవత్సరంలోనైనా కళాశాల ఏర్పాటుకు ముందడుగు పడుతుందని ఆశతో ఎదురు చూస్తున్నాం.

– శివ, 10వ తరగతి పాసైన విద్యార్థి, లింగాల

ఆదేశాలు రాలేదు

ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం కోరితే పూర్తి సమాచారంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తాం.

–ఎండీ బషీర్ అహ్మద్, ఎంఈఓ, లింగాల